క్లుప్తంగా

శ్రీవాసవీ కల్యాణ మండపం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నర్సీపట్నం: శ్రీవాసవీ కల్యాణ మండప సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.వి.ఎ.ఎన్.జోగారావు, సెక్రటరీ పి.కన్నయ్యశెట్టి, ట్రెజరర్ వుడా సూర్యారావు, ఉపాధ్యక్షులుగా తాటికొండ సీతారామ్, సుతాపల్లి చైతన్య కుమార్, జాయింట్ సెక్రటరీలు బి.వి.రామశేషు, తాటికొండ హేమంత్ ఎన్నికయ్యారు. సంఘం పూర్వ నాయకులు వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్ల నిర్వహణ, బ్యాంకింగ్ సేవలపై అవగాహన



మార్టులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

మాకవరపాలెం: ఇంటర్న్‌షిప్‌లో భాగంగా టెన్త్ విద్యార్థులకు సూపర్ మార్కెట్ల నిర్వహణ, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న బ్యాంకులు, మార్టుల్లో అవగాహన కల్పించినట్టు హెచ్‌ఎం నారాయణరావు తెలిపారు. పది రోజులపాటు ఈ ఇంటర్న్‌షిప్ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్స్ కిరణ్మయి, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు

మాకవరపాలెం: జీఎస్టీని తగ్గించడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. జీఎస్టీ తగ్గడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాకవరపాలెంలో వ్యవసాయ యంత్ర పరికరాలతో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అనంతరం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ఛాయాసుధ, ఏవో అప్పారావు, ఎంఈవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోనాం జలాశయం నుంచి 300 క్యూసెక్కుల విడుదల



కోనాం జలాశయం ప్రధాన గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం ప్రధాన గేట్ల నుంచి గురు,శుక్రవారాల్లో 300 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్టు ఇన్‌చార్జి ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 99.40 మీటర్లు ఉందని ఆయన చెప్పారు.

జీవామృతం తయారీ కేంద్రం ప్రారంభం



జీవామృత తయారీని ప్రదర్శిస్తున్న సిబ్బంది

రోలుగుంట: మండలంలోని కొంతలంలో శుక్రవారం జీవామృత కషాయం తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ నానాజీ, మాజీ సర్పంచ్ కుంచంగి హరిబాబు దీనిని ప్రారంభించారు. కషాయం వినియోగాన్ని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చిరంజీవి రైతులకు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయాధికారి ఉమ, కేంద్రం మేనేజర్ సీహెచ్ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ



రావికమతంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రావికమతం: జీఎస్టీ తగ్గింపుపై రావికమతంలో శుక్రవారం ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వరిపై తెగుళ్ల దాడి

- వాతావరణంలో మార్పులతో చీడపీడల విజృంభణ
- పట్టించుకోని వ్యవసాయశాఖ సిబ్బంది
- అవస్థలు పడుతున్న అన్నదాతలు

గొలుగొండ: వరి పైరుపై పలు రకాల తెగుళ్ల దాడి చేస్తున్నాయి. అధికంగా వర్షాలు కురవడం, మరో పక్క వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడం వంటి వాతావరణ మార్పుల కారణంగా తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం వరి పొలాల్లో పొడతెగులు, పచ్చపురుగు, సుడిదోమ వ్యాపిస్తున్నాయి. వీటిని నివారించడానికి రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. మండలంలో ఏడు వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. విప్పలపాలెం, దారపాలెం, అమ్మపేట, గాదంపాలెం, గొలుగొండ, ఏటిగైరంపేట ప్రాంతాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో తెగుళ్ల వ్యాపించినట్టు రైతులు తెలిపారు. వరి నాట్లు వేసి ఇప్పటికి 40 రోజులు కావస్తోంది. సుడిదోమ కారణంగా వరి పంటంతా నాశనమవుతోందని రైతులు వాపోయారు. వరి పంటను కాపాడుకునేందుకు పలుసార్లు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కనిపించలేదని తెలిపారు. రోజూ వర్షాలు కురుస్తుండడం వల్లే తెగుళ్ల తగ్గుముఖం పట్టడంలేదని ఆవేదన చెందుతున్నారు.

అవగాహన లేక నష్టపోతున్న రైతులు

మండలంలో తెగుళ్ల విజృంభిస్తున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. రైతు కేంద్రాలకు వెళ్లినా సిబ్బంది సరిగా స్పందించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల పట్ల, వరి పైరుకు సోకే తెగుళ్లకు ఎటువంటి పురుగు మందులు వాడాలి, ఎంత మోతాదు వాడాలి అనే విషయంలో అవగాహన లేకపోవడం వల్ల ప్రైవేట్ పురుగు మందుల షాపులను వారు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు తమఇష్టానుసారం మందులను అంటగడుతున్నారు. దీంతో తెగుళ్ల తగ్గకపోగా మరో పక్క రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.



పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు



తెగులు సోకిన వరి పంట

సుడిదోమతో పంట నాశనం

వరి పంట వేయాలంటే భయపడుతున్నాం. పెట్టుబడులు బాగా పెరిగిపోవడంతో పాటు తెగుళ్ల ఆశిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. మండలంలో వరి పంటకు సుడిదోమ అధికంగా సోకింది. దీంతో పంటంతా నాశనమవుతోంది. పంటకు తెగుళ్ల సోకడంతో పెట్టుబడులు భారీ పెరుగుతున్నాయి. తెగుళ్ల నివాణకు చాలా మంది ప్రైవేట్ షాపు యజమానులను ఆశ్రహిస్తున్నారు. వారు సరైన మందులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి.

– నారాయణమూర్తి, రైతు, గొలుగొండ

అధిక వర్షాలతో తెగుళ్లు



వరి పంటపై వస్తున్న తెగుళ్ల కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ ఏడాది దారగెడ్డ ప్రాంతంలో వేసిన నాట్లకు అధిక వర్షాలు కారణంగా తెగుళ్ల సోకాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. రసం పీల్చే పురుగుల వల్ల వరి పంట పూర్తిగా తెల్లబారిపోయి, ఎదుగుదల లేకుండా పోతోంది. వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలి.

– నూకరాజు, రైతు

పొలాల నుంచి నీటి తరలింపునకు చర్యలు

తహసీల్దార్, జేఈ చొరవతో సమస్య పరిష్కారం



కాలువ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని రైతులకు చూపిస్తున్న తాండవ జేఈ శ్యామ్‌కుమార్



రైతుల సమస్యలు వింటున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: మండలంలోని శృంగవరంలో ఏడేళ్లుగా రైతులను వెంటాడుతున్న నీటి ముంపు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పొలాల నుంచి కాలువ ద్వారా గెడ్డలోకి నీటిని తరలించేందుకు అధికారులు, రైతులు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమోదించారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, తాండవ ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది. మండలంలోని శృంగవరంలో మాజీ సర్పంచ్ ఉలబాల అప్పలనాయుడు ఏడేళ్ల కిందట పంటపొలాల్లోకి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈరోడ్డు వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఉపయోగకరంగా ఉంటోంది. రోడ్డు వేసేటప్పుడు మధ్య తూరలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు రైతుల భూమిలో నీరు బయటకు ప్రవహించకుండా నిల్వ ఉండిపోతోంది. దీంతో ఏడేళ్లుగా రైతులువరినాట్లు వేయకుండా భూమిని వృథాగా వదిలేశారు. ముంపునకు గురైన పొల్లాలో గత నెల 29న రైతులు నిరసన తెలిపి, అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ వేణుగోపాల్ పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలో శుక్రవారం సభ ఏర్పాటు చేసి, అందరి ఆమోదంతో కాలువ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్, జేఈ శ్యామ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ నీరు ప్రవహించేందుకు ముందు తాత్కాలికంగా గెడ్డలోకి కాలువ ఏర్పాటు చేస్తామన్నారు. ఈసమస్యను శాశ్వతంగా పరిష్కారించేందుకు ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.15 లక్షల నుంచి రూ.20లక్షల వరకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి ఈ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తాండవ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు ఉలబాల పేర్రాజు, తాండవ ప్రాజెక్టు వర్కు ఇన్‌స్పెక్టర్ అప్పారావు, మాజీ సర్పంచ్ ఉలబాల అప్పలనాయుడు, సర్వేయర్ విజయ్‌కుమార్. గ్రామ పెద్ద సుర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతి పితకు ఘన నివాళి



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముని అడుగు జాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ సభ్యులు దాసరి వెంకటరమణ, పడిదెడకల గోపి, బత్తుల సేనయ్య, గ్రామ పెద్దలు శనివాడ రాజు. కొప్పాక మాలిబాబు, బోని జగ్గారావు, దువ్వార రమణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గృహోపకరణాల పంపిణీ



గృహోపకరణాలు అందిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ

కె.కోటపాడు : కింతాడకు చెందిన రావాలమ్మ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ తన సొంత నగదు రూ.5.70 లక్షలతో 70 మంది సంఘ సభ్యులకు గురువారం గృహోపకరణాలు, దుస్తులు, స్వీట్లను పంపిణీ చేశారు. ఎ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సొంత సొమ్ముతో గృహోపకరణాలు అందజేసిన సూర్యనారాయణ అందరికీ ఆదర్శనీయుడన్నారు. సూర్యనారాయణకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కశిరెడ్డి అప్పలనాయుడు,మండల పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నూరు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో బ్లాస్టింగ్‌పై నిరసన

గాంధీజీ చిత్రపటానికి వినతి పత్రం సమర్పించిన బాధితులు



రాజన్నపటలో గాంధీజీ చిత్రపటానికి వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసీలు

రోలుగుంట: నల్లరాయి క్వారీలో జరుగుతున్న బాంబ్ బ్లాస్టింగ్‌పై ఆదివాసీలు నిరసన వ్యక్తం చేశారు. తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని, తమను కాపాడాలని కోరుతూ రాజన్నపేట, గడబపాలెం తదితర గ్రామాలకు చెందిన ఆదివాసీలు రాజన్నపేటలో గాంధీజీ చిత్రపటానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బోనంగి రామలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యవర్గం సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ శరభవరం రెవెన్యూ పరిధిలో నాలుగు 4.79 ఎకరాల విస్తీర్ణంలో ఎల్.రాజు రోడ్డు మెటల్, బిల్డింగు స్టోన్ సంస్థ నల్లరాయి క్వారీ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ క్వారీని అనుకొని రాజన్నపేట, గడబపాలెం గ్రామాల్లో సుమారు 300 పీవీటీజీలు జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. క్వారీలో బ్లాస్టింగ్ వల్ల 40 ఇళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ విషయమై కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశామని, రోలుగుంట తహసీల్దార్ నాగమ్మ దెబ్బతిన్న ఇళ్లను గత నెలలో స్వయంగా పరిశీలించారని చెప్పారు. అయితే ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. క్వారీని రద్దు చేసి తమను కాపాడాలని గ్రామస్తులు కోరారు.

చేపలదుకాణాలను మార్కెట్ యార్డ్‌కు తరలించాలి



కొత్తకోట గ్రామ సభలో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ పందల దేవా

రావికమతం: మండలంలోని కొత్తకోటలో ఆలయాల వద్ద ఉన్న మాంసం,చేపలు దుకాణాలను తొలగించి మార్కెట్ యార్డ్‌కు తరలించాలని డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి ఆదేశించారు. కొత్తకోటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్,ఎంపీటీసీ తదితరులు ఆలయాల వద్ద గల మాంసం దుకాణాలు,ఆక్రమణల తొలిగింపుపై గ్రామ సభలో ప్రస్తావించారు. దీంతో స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ వెంటనే వాటిని తరలించాలని ఆదేశించారు. మండల పరిషత్‌కు చెందిన సుమారు రెండు ఎకరాల స్థలంలో చాలా వరకు ఆక్రమణకు గురైందని, సర్వే చేయించి ఆక్రమించిన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు గ్రామ సభలో కోరారు. మండల పరిషత్‌కు చెందిన వాణిజ్య సముదాయంలోని దుకాణాలు ఏళ్ల తరబడి కొందరి చేతుల్లోనే ఉన్నాయని, బహిరంగ వేలం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు,వైస్ సర్పంచ్ పందల దేవా,ఎంపీటీసీ పూడి దేవా ,ఈవో జ్యోతిశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జామి రమణబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలను గ్రామస్తులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గాంధీ బొమ్మ నుంచి శాలిపేట వరకూ జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటా కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని తెలిపారు. కె.జె.పురం జంక్షన్‌లో బస్సులు ఆపకపోవడం వల్ల కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు తెలిపారు. ఈ గ్రామ సభలో పలు అంశాలపై సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి బి. వంశీ నవీన్ దొర, పంచాయితీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కె.జె.పురం రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: పాశాంకుశ ఏకదశి పర్వదినం సందర్భంగా వైష్ణవాలయాలల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కె.జె.పురం రామాలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు, వీరనారాయణం రామాలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. గాదిరాయి, పెంటయ్యపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో పూజలు నిర్వహించారు.

అధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నర్సీపట్నం: లహరి కృష్ణ బోధనలతో సమాజ శ్రేయస్సు ముడిపడి ఉందని లహరికృష్ణ భక్తులు పి.నాగేశ్వరరావు, అప్పలరాజు అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం ధర్మయోగం–నీతి యోగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాత్మిక కార్యక్రమాలతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది లహరిభక్తులు ,ఆరుగుల్ల రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం



రోలుగుంటలో అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న బెంగాలీ డ్యాన్స్ ప్రదర్శన



కొండపాలెంలో దుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు



పీకే గూడెంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చొడవాడలో దుర్గాదేవి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



ఎ.కొత్తపల్లిలో దుర్గాదేవి ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. గ్రామాల్లో మండపాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. కొండపాలెంలో స్థానిక సూరమ్మ చెరువు, రోలుగుంటలో కోనేరులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

నాతవరం: మండలంలోని పీకే గూడెం గ్రామంలో శరవన్నరాత్రి ఉత్సవాల సందర్భంగా భారీ ఊరేగింపుతో అమ్మవారికి సారె సమర్పించారు. లడ్డూ బహిరంగ వేలం పాట నిర్వహించడంతో భక్తులు పోటీ పడి పాడారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

కె.కోటపాడు : చౌడువాడ కనకదుర్గాదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహిళల కోలాటాల మధ్య విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లి, బోయిల కింతాడ, సీతమ్మపేట, నాగయ్యపేట, రైవాడ, వాకపల్లి తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఊరేగింపు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎ. కొత్తపల్లిలో మహిళల కోలాటం నడుమ ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా దుర్గాదేవికి పలు రకాల పిండి వంటలతో సారె సమర్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో శరన్న నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. దేవీతల్లిని గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. సివిల్ ఆర్టీసీ, మోటార్ యూనియన్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

చీడికాడ: మండలంలోని అర్జునగిరిలో స్వయంభూ శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయం వద్ద గల దేవి పీఠం వద్ద గురువారం రాత్రి కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన దీపాలంకరణ ఆకట్టుకుంది.

మాడుగుల రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంతో పాటు కేజేపురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక కుంకమ పూజలు, అన్నసమారాధనలు నిర్వహించారు. కేజే పురం కళావేదిక మీద ప్రతిష్ఠించి దుర్గమ్మ ప్రతిమ వద్ద , వీరనారాయణం, గాదిరాయి, వి.వి.అగ్రహారం తదితర గ్రామాలల్లో పూజలు జరిపారు.

చోడవరం: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనోత్సవాలను మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య గురువారం ఘనంగా జరిపారు. చోడవరం పట్టణంలోని చినబజార్, అన్నవరం, నర్సయ్యపేట, గాంధీ గ్రామం, లక్కవరం, గవరవరం, అంకుపాలెం, వెంకన్నపాలెం, గంధవరం, నర్సాపురం, శీమునాపల్లి, గోవాడ,భోగాపురం, బెన్నవోలు, గౌరీపట్నం, ఖండిపల్లి, దామునాపల్లి,లక్ష్మీపురం ప్రాంతాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



చోడవరంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న దీపాలంకరణ



పీకే గూడెంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

ఎట్టకేలకు పోలీస్‌స్టేషన్ భవనానికి మోక్షం



పోలీసు స్టేషన్ నూతన భవనం

నాతవరం: ఎట్టకేలకు స్థానిక పోలీసు స్టేషన్ అదనపు భవనం ప్రారంభోత్సవానికి మోక్షం లభించింది. ఈ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి ఏడాదికి పైగా అవుతోంది. అప్పటి నుంచి భవనానికి ప్రారంభోత్సవం చేయకుండా కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది.ఈనెల 4వ తేదీన భవనాన్ని స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర హోమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సి.ఎం. రమేష్ ప్రారంభించనున్నట్టు మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్ల వెంకటరమణ తెలిపారు.